క్లుప్తంగా

దత్తక్షేత్రంలో గణపతి సచ్చిదానంద స్వామీజీ జన్మదినోత్సవం


బాదంపూడి దత్త క్షేత్రంలో స్వామీజీకి పూజలు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: బాదంపూడి దత్త క్షేత్రంలో మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ జన్మదినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయ నిర్మాత శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. తొలుత విజ యగణపతికి పూజలు చేశారు. బాలసుబ్ర హ్మణ్యస్వామికి,బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులకు పూజలు చేశారు. గణపతి స్వామీజీపై పలువురు భక్తులు సంకీర్తనలు ఆలపించారు.

29న దివ్యాంగుల గుర్తింపు శిబిరం

దెందులూరు: దెందులూరులో ఈ నెల 29న గారపాటి హైమావతీదేవి ఉన్నత పాఠశాలలో సర్వశిక్ష ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి దివ్యాంగుల నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్టు సర్వశిక్ష డిప్యూటీ కలెక్టర్ బి.సోమశేఖర్ అన్నారు. ప్రత్యేక అవసరాలు గల బాల బాలికలకు ఉచిత పరికరాల పంపిణీ కోసం లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమం నిర్వహిస్తామని సోమవారం వివరించారు. దివ్యాంగుల నిర్ధారణ శిబిరంపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన కోరారు.

రంగారావుకు నివాళులర్పించిన కొఠారు

పెదవేగి : పెదకడిమి గ్రామంలో పర్వతనేని రంగారావు మరణించగా వారి పార్థివదేహాన్ని సందర్శించిన వైఎస్సార్‌సీపీ నేత కొఠారు రామచంద్రరావు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన వెంట పర్వతనేని నాగయ్య, చళ్లగొళ్ళ భూస్వామి, పర్వతనేని కృష్ణారావు తదితరులు ఉన్నారు.

వైభవం.. మలయప్ప స్వామి కల్యాణం


మలయప్ప స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్థానిక టెంపుల్ సెంటర్లోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో ఉపాలయంగా కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈనెల 15న స్వామివారి కల్యాణ మహోత్సవాలు ప్రారంభంగా కాగా ఆదివారం దేవేరులు, స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. కొల్లూరు శ్రీనివాస్ పావని దంపతుల చేత బ్రహ్మశ్రీ శ్రీ సుదర్శనం రామ దుర్గా కుమారాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువు జరిపించారు. స్వామివారి మూలవిరాట్ విగ్రహం ఎదుట ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు నిర్వహించిన అన్న సమారాధనతో ఉత్సవాలు ముగిశాయి.

వైద్య రంగానికి అగ్రపీఠం వేయాలి


నిర్మల కిషోర్‌తో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ అసోసియేషన్ నాయకులు

కొయ్యలగూడెం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా వైద్య ఆరోగ్య రంగాన్ని అన్ని విధాలుగా అగ్రభాగాన నిలపాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు బొల్లిన నిర్మలా కిషోర్‌ని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి జీవీవీ ప్రసాద్, నాయకులు కోరారు. కొయ్యలగూడెంలోని నిర్మల కిషోర్‌ను సోమవారం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. కొయ్యలగూడెంలో పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు చింతా జానకీరామరాజు, డీవీ రామారావు, కొక్కిరపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

కొయ్యలగూడెం: అంకాలగూడెం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన సొంగా రాజేష్ కుటుంబానికి దాతలు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. నల్లజర్ల మండలం చీపురుగూడెం గ్రామానికి చెందిన సామాజికవేత్త, వసంతాడ ఆనంద్ స్వరూప్, ఉందుర్తి రమణ మహర్షి మిత్ర బృందంలోని సభ్యులు బాధిత కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గుళ్లపూడి సతీష్ గుప్తా, రాచర్ల సంజన ప్రణీత్, గెల్లా రాజు, బొల్లిపో మధుశేఖర్, కవిటి లలిత, పూసల సురేష్, బొందల శ్రీనివాస్, పాక వీరన్న, ముంద్రు శ్వేత పాల్గొన్నారు.

ఘాటెక్కిన ఉల్లి, కొత్తిమీర ధర

- కట్ట ధర రూ.50
- సామాన్యులు విలవిల





దెందులూరు: కొత్తిమీర, ఉల్లిపాయల ధరలు కొండెక్కి కూర్చొన్నాయి. పది రోజుల నుంచి ఈ రెండింటికీ ధర పెరగడంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. తెలుగు సంప్రదాయ వంటకాల్లో వాడే కొత్తిమీర ధర నానాటికీ పెరుగుతోంది. మాంసాహారం, శాకాహారం అనే తేడా లేకుండా ప్రతి వంటలోనూ రుచి, వాసన కోసం కొత్తిమీర ఉపయోగిస్తారు. వంటకంతో పాటు రుచి, ఆరోగ్యపరమైన లక్షణాలు కలిగి శారీరక సమస్యలు తొలగించేందుకు విశేషంగా కొత్తిమీర తోడ్పడుతుంది. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న కొత్తిమీర ధర ఒక్కసారిగా అమాంతంగా పెరిగింది. దీంతో భోజన ప్రియులు పెరిగిన ధరను భరించలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఒకప్పుడు కొత్తిమీర కట్ట రూ.10 ఉండేది. పది రోజుల నుంచి ధర పెరగడంతో ప్రస్తుతం కట్ట రూ.50 చేరడంతో కొనుగోలుదారులు అవాక్కయ్యారు. అల్పాహారంలోకి కొత్మిమీరతో చట్నీలు చేసుకునే వారు సైతం పెరిగిన ధర చూసి కొనుగోలుకు వెనకడుగు వేస్తున్నారు.

కన్నీరు తెప్పిస్తున్న ఉల్లి ధర

భారతీయ వంటల్లో అతి ముఖ్యమైనవి ఉల్లిపాయలు. రక్తపోటు, గుండెజబ్బులు, ఆస్తమా, అలెర్జీ, దగ్గు, జలుబు, నిద్రలేమి, ఊబకాయం వంటి వ్యాధుల నివారణకు ఉల్లి దోహదపడుతుంది. ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయుదంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉల్లి నుంచి ఆ మేలు పొందే పరిస్థితి లేదు. ఉల్లి మాట ఎత్తాలంటేనే భయమేస్తోంది. పెరిగిన ధరలతో ఉల్లిపాయ కోయకుండానే కంటి నుంచి నీరుకారుతున్న పరిస్థితి నెలకొంది. గతంలో కేజీ రూ.25–30 ఉంటే ప్రస్తుతం రూ.50 చేరింది. దీనికి తోడు నిల్వలు లేకపోవడం, రవాణా మందగించడంతో ఉల్లి ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. దీంతో కొద్ది ఉల్లిపాయలతోనే కూర తయారు చేసుకునే పరిస్థితి నేడు ఉంది. ఒకవైపు పూర్తిస్థాయి సరఫరా లేక, మరో వైపు పెరిగిన ధరలతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

చుక్కలు చూపిస్తున్న కూరగాయల ధరలు



గణపవరం: కూరగాయల ధరలు సామాన్యుల గూబ గుయ్యిమనిపిస్తున్నాయి. పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. ఏ కూరగాయల ధర విన్నా షాక్ కొడుతున్నాయి. దీనితో సామాన్య, మధ్యతరగతి ప్రజల ఏం కొనాలో.. ఏం తినాలో అర్థంకాక తలపట్టుకుంటున్నారు. సోమవారం గణపవరంలో నిర్వహించిన వారపు సంతలో కూరగాయల ధరలకు రెక్కలొచ్చి ఆకాశంలో విహరించాయి. నెలరోజుల క్రితం ధరలతో పోలిస్తే దాదాపు రెట్టింపు ధరలు పలికాయి. చివరికి ఆకుకూరలు సైతం అందుబాటులో లేకుండా పోయాయి. అల్లం ధర కిలో రూ.100 నుంచి రూ.200కు ఎగబాకింది. కొత్తిమీర కిలో రూ.150 పలికింది. దీనితో హోటళ్లు, పాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కర్రీ పాయింట్ల యజమానులు ఇబ్బంది పడ్డారు. ఇక కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. ఉల్లి కిలో రూ.40–50, మిర్చి రూ.80, టమాటా రూ.100, బీర రూ.80, దోస రూ.40, బంగాళ దుంప రూ.40, కాకర రూ.80, చిక్కుడు రూ.120, క్యారెట్ రూ.60, బీట్‌రూట్ రూ.60, చిలగడదుంప రూ.50, మునగకాయలు ఒకటి రూ.10, ఆనపకాయ రూ.40 చొప్పున పలికాయి. ఇక మిగిలిన కూరగాయల ధరలూ గత వారంతో పోలిస్తే 20 నుంచి 30 శాతం పెరిగాయి. మొత్తం మీద రెండు వారాలుగా పెరుగుతూ వస్తున్న కూరగాయల ధరలు ఈ వారం మరింత భారంగా మారాయి.

సీఎం బందోబస్తుకు తరలివెళ్లిన పోలీసులు

ఉంగుటూరు: సీఎం చంద్రబాబు పోలవరం పర్యటన సందర్భంగా ఉంగుటూరు నియోజకవర్గంలోని పోలీసులు పోలవరం సోమవారం తరలివెళ్లారు. సీఐ సుభాష్, చేబ్రోలు ఎస్సై మణికుమార్, పోలీసులందరూ పోలవరం వెళ్లారు. బందోబస్తు నిమిత్తం ఆదివారం సాయంత్రమే వారు పోలవరం చేరుకున్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు ప్రారంభం


దెందులూరులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ తోట ఏసమ్మ, కార్యదర్శి చౌదరి

దెందులూరు: జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశాల మేరకు మండలంలో పారిశుద్ధ్య పనులు గ్రామాల్లో ప్రారంభించామని దెందులూరు ఎంపీడీఓ శ్రీలత అన్నారు. దెందులూరులో సర్పంచ్ తోట ఏసమ్మ, కార్యదర్శి వీఎస్ చౌదరి చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలింపు, డ్రెయిన్లను పరిశుభ్ర పరచడం తదితర పనులను చేయించారు. ఆరు రోజులు పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు కొనసాగుతాయని ఎంపీడీఓ వివరించారు. అన్ని గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఈఓపీఆర్‌డీ, కార్యాలయ ఏఓతో కలిసి పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్


భీమడోలు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు


దెందులూరు గౌడవీధిలో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు


గణపవరం పెద్ద మసీదులో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లిం సోదరులు

భీమడోలు: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు సోమవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని భీమడోలు, అంబర్‌పేట, పూళ్ల, పోలసానిపల్లి, పాతూరు, గుండుగొలను గ్రామాల్లోని మసీదు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులంతా తరలివచ్చి మసీదుల్లో భక్తి శ్రద్ధలతో మోకాళ్లపై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్ ముబారక్ అంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆలింగనం చేసుకున్నారు. ముస్లింలు పేదలకు దానధర్మాలు చేశారు. భీమడోలు మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ రహీమా బేగం హసేనా ఆధ్వర్యంలో మత బోధకులు దిల్షాద్ బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ అల్లాహ్ బోధనల మేరకు నడుచుకోవాలని కోరారు. పరిసర గ్రామాలకు చెందిన ముస్లిలంతా ఇక్కడకు చేరుకుని నమాజ్ చేశారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

దెందులూరు: పేదలను ఆదుకోవడం, వారికి దాన ధర్మాలు చేయడం అతి ముఖ్యమని ఇమామ్ సర్దామ్ అన్నారు. సోమవారం మండలంలోని గ్రామాల్లో మసీదుల్లో బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్‌లు చేశారు. దెందులూరు గౌడవీధి మసీదులో ముతవలీ షేక్ జహీర్, కార్యదర్శి యాకోబు ఆధ్వర్యంలో ముస్లింలు నమాజ్ చేశారు. సంఘ పెద్దలు డాక్టర్ ఈసు తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ

గణపవరం: బక్రీద్ సందర్భంగా సోమవారం పెద్ద సంఖ్యలో ముస్లింలు మసీదుకువచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు పెద్దగురువు అర్మాన్‌రజా, చిన్నగురువు ఫారూఖ్ మాట్లాడుతూ మనిషి త్యాగనిరతిని సజీవంగా నిలిపేందుకు, తరతరాలుగా ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అల్లా ఆజ్ఞను తూచ తప్పకుండా పాటించడమే బక్రీద్ పండుగ జరుపుకోవడంలో పరమార్థమని అన్నారు. బక్రీద్ రోజున ఖుర్బాని ఇవ్వడం పవిత్ర కార్యమని, ప్రతి ముస్లిం గొర్రె లేదా పొట్టేలు మాంసంలో ఒక వంతు పేదలకు, మరో వంతు బంధువులకు పంపించడం బక్రీదు పండుగ రోజున చేసే ప్రధాన కార్యక్రమ మని తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదు పెద్దలు షేక్ ఇస్మాయిల్, ఎండీ ఖాదర్‌ఖాన్, ఎండీ బహదూర్, షేక్ రహంతుల్లా, షేక్‌నాగూర్, షేక్ బషీర్ పాల్గొన్నారు. బక్రీదు పర్వదినం సందర్భంగా గణపవరం పెద్ద మసీదుకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత


జేఈఈ ర్యాంకు సాధించిన రవితేజకు ఆర్థిక సాయం చేస్తున్న ఉపాధ్యాయుల బృందం

భీమడోలు: ద్వారకాతిరుమల మండలం మత్తేవారి గూడెంకు చెందిన ప్రతిభ గల పేద విద్యార్థినికి ఆర్థిక సాయం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. సాయి హెల్పింగ్ హ్యాండ్‌లోని ఉపాధ్యాయుల బృందం ఆదివారం మత్తేవారిగూడెంలోని విద్యార్థి పంతగాని రవితేజకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. పంతగాని రామకృష్ణ కుమారుడు రవితేజ ఇంటర్‌లో 920 మార్కులు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లో ఎస్సీ కేటగిరిలో మంచి ర్యాంకు సాధించాడు. రవితేజ తండ్రి రామకృష్ణ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. తల్లి మానసిక పరిస్థితి బాగోలేని కారణంగా ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంది. దీనితో రవితేజ ఉపాధి హామీ పనులు చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. దీనితో సమాచారం అందుకున్న ఉపాధ్యాయుల బృందం మెయిన్‌లో సీటు వస్తున్నందున అతని చదువుకు అవసరమైన రూ.10వేల నగదును గొల్లగూడెం, శనివారపుపేట హెచ్‌ఎంలు గారపాటి ప్రకాష్, పయ్యావుల సాయిబాబా చేతులకు అందజేశారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సీహెచ్ శ్రీధర్, డీకేఎస్ఎస్ ప్రకాష్, పి.ఉమామహేశ్వరరావు, పి.మోహన్, ఈ.శ్రీనివాస్, గుంటూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు కృష్ణ చైతన్య

బుట్టాయగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో గిరిజనులు సాగు చేస్తున్న పోడుభూములకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య కోరారు. మండలంలోని సీతప్పగూడెంలో సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ మండల సహాయ కార్యదర్శి మడకం దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను టీడీపీ తప్పనిసరిగా అమలు చేసేలా కృషి చేయాలన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులు అనేక మంది పోడుభూములను సాగు చేస్తున్నారని వారందరికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే గిరిజన ప్రాంతలో నీటి వసతి లేని గ్రామాల్లో మంచినీటి సదుపాయం కల్పించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయలు కల్పించడంతో పాటు నిర్వాసిత కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జేవీ రమణరాజు, తెల్లం వీరమ్మ, గుండి నాగరత్నం, చోడే గంగరాజు, కుర్స సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ


గిరిజనులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగర, పట్టణ ప్రాంతాల ప్రజలకు మాత్రమే కాక గిరిజన ప్రాంతాల ప్రజలకు సైతం సేవలు విస్తృతం చేయాలనే లక్ష్యంతో ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్, ఏలూరు విజన్ లయన్స్ క్లబ్‌లు పని చేస్తున్నాయని ప్రతినిధులు తెలిపారు. సోమవారం ఈ రెండు క్లబ్‌ల ప్రతినిధులు జిల్లాలోని బుట్టాయగూడెం మండలం మోతుగూడెం, దానిగూడెం, కోర్సవారి గూడెంలలో గిరిజనులకు దోమతెరలు, గొడుగులు, పాదరక్షలు, స్టీలు కంచాలు, గ్లాసులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా క్లబ్‌ల సభ్యులు సీలంశెట్టి కిషోర్, చుక్క అవినాష్, అడపా రాఘవ, తుమ్మల రవికుమార్, తోట ఎడ్వర్డ్, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

లింగపాలెం: ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, కార్యకర్తలు ఎవ్వరూ నిరుత్సాహం చెందాల్సిన పని లేదని, ధైర్యంగా ఉండాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు భరోసా కల్పించారు. సోమవారం లింగపాలెం మండలంలోని కలరాయునగూడెం, వేములపల్లి గ్రామాల్లో ఆయన పార్టీ సీనియర్ నాయకుడు బీవీఎస్ రెడ్డితో కలిసి పర్యటించారు. ఇటీవల టీడీపీ శ్రేణుల దాడులకు గురైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి బాధితులను వారు పరామర్శించారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటుందని చెప్పారు. తాము పార్టీ శ్రేణుల వెన్నంటే ఉంటామని ధైర్యంగా ఉండాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. టీడీపీ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నా.. వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం పాటించి శాంతియుతంగా ఉండాలని విజయరాజు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, సొసైటీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, వైస్ ఎంపీపీలు మట్టా సురేష్, కర్లపూడి జాన్సి, పార్టీ నాయకులు రావికొండయ్య, బి ప్రసాద్ రెడ్డి, ఎం.లోకనాథ్‌రెడ్డి, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ప్రమాదకారి గొంతువాపు వ్యాధి


నీలాద్రిపురంలో గొంతువాపు వ్యాధి నివారణకు టీకా వేస్తున్న దృశ్యం


నాచుగుంట పంచాయతీ పరిధిలో టీకా వేస్తున్న బాబూరావు

ఉంగుటూరు: గొంతువాపు పశువుల్లో వచ్చే సహజమైన వ్యాధి. ప్రధానంగా వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధుల్లో ఇది ప్రధానమైనది. ఈ వ్యాధి పశువులకు సోకినప్పుడు రైతులు సకాలంలో స్పందించి వైద్యం అందించాల్సిన అవసరం ఉంది. దీనినే గురక వ్యాధి అంటారు. అప్రమత్తంగా లేకపోతే పశువును పెంచే రైతుల ఆర్థికంగా నష్టపోతారు. ప్రధానంగా ఈ వ్యాధి జూన్, జూలైలో పశువులకు ఎక్కువగా సోకుతుంది. ముందస్తుగా టీకాలు వేయించడం ద్వారా ఈ గొంతు వాపు వ్యాధి పశువులకు రాకుండా కాపాడుకోచ్చు.

నల్లజాతి పశువులకు ఎక్కువ

నల్లజాతి పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. వర్షాల కారణంగా నీరు కలుషితమవడంతోపాటు జూన్, జూలైలో పెరిగే మొక్కలను మేయడం ద్వారా ఈ వ్యాధి పశువులకు అధికంగా వచ్చే అవకాశం ఉంది.

వ్యాధి లక్షణాలు

పశువులు ఆయాస పడుతుంటాయి. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడతాయి. శ్వాస పీల్చే సమయంలో గుర్రుమనే శబ్దం వస్తుంది. పశువుకు గొంతు, మెడ భాగంలో వాపు వస్తుంది. కళ్లు ఎర్రగా మారి, కళ్ల నుంచి నీరు కారుతుంది. అధిక జ్వరం రావడం వంటి లక్షణాల ద్వారా గొంతు వాపు వ్యాధిని గుర్తించవచ్చు. వ్యాధి సోకిన 24 గంటల్లో గుర్తించి స్పందించకపోతే పశువు మృత్యువాతకు గురయ్యే ప్రమాదం ఉంది.

నివారణ చర్యలు

ముందుగా జూన్, జూలైలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పశువులకు కలుషితనీరు, కలుషిత ఆహారం ఇవ్వకూడదు. బలవర్ధకమైన ఆహారం నాణ్యమైన పచ్చగడ్డి, ఎండుగడ్డి, ఖనిజ లవణాల కలిగిన మిశ్రమాన్ని ఆహారంగా ఇవ్వాలి. పశువుల శాలలు శుభ్రంగా, గాలి వెలుతురు ధారాళంగా వచ్చేలా ఉంచాలి. పశువులకు మేత వేసే గిన్నెలు, తొట్టెలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధి సోకిన పశువులను వేరు చేసి చికిత్స అందించాలి.

వ్యాధిని సకాలంలో గుర్తించాలి



పశువుల్లో గొంతువాపు వ్యాధిని సకాలంలో గుర్తించి టీకాలు ముందస్తుగా వేయించాలి. పశుపోషణలో శాస్త్రీయ దృక్పథాన్ని అవలంభించి పశుసంతతిని కాపాడుకోవాలి. గొంతువ్యాపు వ్యాధి నివారణకు ముందుగా ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేస్తుంది. వీటిని సద్వినియోగం చేసుకుని రైతులు లాభపడాలి.

– మల్లిపూడి చిన్న బాబూరావు, వెటర్నరీ లైవు స్టాకు అధికారి